నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 19 ఏప్రిల్ 2026

కేంద్రం వైఖరి వల్లే...

మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయింది

-పీవోడబ్ల్యూ (విముక్తి) బొనుగుల లలి, పెర్క సునీత

జవహర్ నగర్, ఏప్రిల్ 18(నినాదం): మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్ సభలో వీగిపోవడంలో కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి దాగి ఉందని, దీనికి పూర్తి బాధ్యత ప్రధానీ నరేంద్రమోదీ, అమిత్ వహించాలని పీవోడబ్ల్యూ (విముక్తి) బొనుగుల లలి, పెర్కసునీత శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లోక్ సభలో మహిళా ప్రాతినిధ్యాన్ని అడ్డుకున్న వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని,ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లును అమలుచేయాలన్నారు. డీలిమిటేషన్ బిల్లు వీగిపోవడం అనేది భారత ప్రజల విజయమని హర్షం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రతిపక్షపార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాలకు పూనుకోవాలని సూచించారు.

వంట గ్యాస్ కొరతతో ప్రజలు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు

కాటారం, ఏప్రిల్ 18 (నినాదం):
గ్రామీణ ప్రాంతాల్లో వంట గ్యాస్ సరఫరా లోపంతో సామాన్య ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లాఅధ్యక్షుడు పీక కిరణ్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత గ్యాస్ బుకింగ్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలోనే ఇంటింటికీ గ్యాస్ డెలివరీ చేయాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత సిలిండర్ అందడానికి సుమారు 20రోజులు పడుతోందని, బుకింగ్ విధానం తెలియక కొంతమంది మరింత ఇబ్బందులుపడుతున్నారని ఆయన తెలిపారు.అదేవిధంగా, ఇండియన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ఏజెన్సీల వద్ద గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకువిక్రయిస్తున్నారని ఆరోపించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1850ఉండగా రూ.3000కి, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ రూ.1000 ఉండగా రూ.2000కివిక్రయిస్తున్నారని అన్నారు. గ్యాస్ గోదాములపై జిల్లా ఉన్నతాధికారులుతనిఖీలు చేయకపోవడం వల్ల అక్రమాలు పెరుగుతున్నాయని, కొందరు యజమానులుడెలివరీకి ముందు ఓటీపీ తీసుకుని సిలిండర్లను బ్లాక్‌లోవిక్రయిస్తున్నారని ఆరోపించారు.గ్యాస్ కొరత కారణంగా చిన్న హోటల్ యజమానులు, బజ్జీ బండ్లు, టీ దుకాణాలవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కమర్షియల్ గ్యాస్ అధికధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో చిన్న వ్యాపారులు ఆర్థికంగానష్టపోతున్నారని అన్నారు.కాబట్టి, హెచ్‌పీ, ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీలపై తక్షణ చర్యలుతీసుకుని గోదాములను తనిఖీ చేయాలని, పాత పద్ధతిలోనే గ్యాస్ సరఫరాపునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్‌ను టీపీఎఫ్ తరఫున విజ్ఞప్తిచేస్తున్నట్లు తెలిపారు. స్పందన లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో యువైఎఫ్ఐ అధ్యక్షుడు అక్కల బాపు, నాయకపోడు సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి మల్లయ్య, మహిళా నాయకురాలు కాలినేని రాజమణి తదితరులు పాల్గొన్నారు.

గట్టుపల్‌లో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు

మునుగోడు, ఏప్రిల్ 18 (నినాదం) :
మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండల కేంద్రంలోని 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం అరైవ్-అలైవ్ జీరో ఎన్ఫోర్స్మెంట్ డే కార్యక్రమంలోని భాగంగా 6వ రోజు ఎస్సై సంజీవరెడ్డి వారి బృందంతో కలిసి రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహనం కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఓవర్ స్పీడ్, ఇవన్నీ తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వద్దని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడువద్దని అలాగా నడిపి పోలీసు వారికి దొరికిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డ్రింక్ అండ్ డ్రైవ్ చాలా డేంజర్ అని తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలు విపరీతంగా ఉండడం వలన, రాత్రిపూట ప్రజలు ఆరుబయట నిద్రించడం వలన దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఆదమరిచి నిదురించవద్దని అనుమాన స్పంద న వ్యక్తులు ఎవరైనా కనబడినచో పోలీసువారికి తెలియపరచాలని కోరారు. మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న సైబరాబాద్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో, హెడ్ కానిస్టేబుల్ పాష, స్వరూప సింగ్, సుదర్శన్, నందిని తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని వారికి పూలతో అవగాహన



భీమదేవరపల్లి, ఏప్రిల్ 18 (నినాదం):
రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు వంగర పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి పూలు, స్వీట్లు అందిస్తూ హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మంగళపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా వంగర ఎస్సై దివ్య ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి పూలు ఇచ్చి, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై దివ్య మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల కోసం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని, "హెల్మెట్ ధరించి నిజమైన హీరోలుగా నిలవాలి, హెల్మెట్ లేకుండా జీరోలు కావద్దు" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజయ్య, కానిస్టేబుళు రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భీమిరెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి



పాలేరు ఏప్రిల్ 18(నినాదం):
పాలేరు నియోజకవర్గం కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ నిన్న సాయంత్రం జరిగిన నిరసన కార్యక్రమంలో దగ్గర నుండి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ని అవమానించారు, వారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి భేషరతుగా క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేస్తున్నాము. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తప్పుగా మాట్లాడారు అని వారి మాటలు వక్రీకరించి , వారితో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ని అవమాన పరిచిన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక బాధ్యతాయుతమైన పదవి లో కొనసాగుతూ, అటువంటి కార్యక్రమంలో పాల్గొన్న భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తన నైజం తెలియ చేస్తుంది.దేశం కోసం నిరంతరం,నిర్విరామంగా అహర్నిశలు విశ్రాంతి లేకుండా కష్టపడుతుంటే ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దిష్టి బొమ్మ తగల పెట్టడం వారి జుగప్సాకర రాజకీయానికి నిదర్శనం.ఆర్థిక రంగంలో ప్రపంచంలోనే నాలుగవ స్థానంలో నిలిపి అభివృద్ధి లో దేశాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ని చూస్తూ జీర్ణించుకోలేక పోతున్నారు. మహిళ బిల్లు ను అడ్డుకొని అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ కి మహిళ ల పట్ల ఉన్న చిత్త శుద్ధి తెలియచేసింది, అదేవిధంగా చరిత్రలో కాంగ్రెస్ మహిళల వ్యతిరేక పార్టీ గా మహిళల ద్రోహి పార్టీ గా నిలిచిపోతుంది.ఇప్పటికి ఐన జరిగిన తప్పిదనాన్ని ఒప్పుకొని,క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే క్యాంప్ కార్యాలయం ముట్టడించి,, క్యాంప్ కార్యాలయం లోనికి అడుగు పెట్టకుండా అడ్డుకుంటాం అన్నారు.

కనుమరుగవుతున్న కట్టుబాట్లు..

హుస్నాబాద్ ఏప్రిల్ 18 (నినాదం);-
నాడు కుటుంబం అంటే ఒక పవిత్ర దేవాలయం. అనుబంధాలు, బాధ్యతలు, నమ్మకాల కలయికే ఒక ఇల్లు. కానీ నేటి ఆధునిక కాలంలో ఆ నమ్మకాల పునాదులు కదిలిపోతున్నాయి. అక్రమ సంబంధాలు, డబ్బుపై మితిమీరిన వ్యామోహం, క్షణికమైన శారీరక ఆనందాల కోసం నిండు నూరేళ్ల వైవాహిక బంధాన్ని కొందరు మంట గలుపుతున్నారు. రక్త సంబంధాలను సైతం విస్మరించి, కన్నబిడ్డలను, కట్టుకున్న భర్తను అడ్డుతొలగించుకోవడానికి కూడా వెనుకాడటం లేదు. ఒకప్పుడు అడుగు బయట పెట్టాలంటే సమాజానికి భయపడి, కుటుంబ గౌరవానికి ప్రాధాన్యతనిచ్చేవారు. కానీ నేడు పరిస్థితులు తలకిందులయ్యాయి.అన్నింటికంటే బాధాకరమైన విషయం ఏమిటంటే, నేటి సమాజంలో కుటుంబాలకు సైతం విలువ ఉండటం లేదు. ఒకప్పుడు కుటుంబం అంటే అండగా నిలిచే గోడ, కానీ ఇప్పుడు అది కేవలం ఒక అవసరంగా మారిపోయింది. స్వార్థం పెరిగిపోయి, ఎదుటివారి ప్రాణం కన్నా తమ కోరికలే ముఖ్యం అనుకునే స్థాయికి దిగజారుతున్నారు. కంటిముందు కనిపిస్తున్న మాయా ప్రపంచాన్ని చూసి, దొరికినదే జీవితం అనుకుంటూ తప్పుదోవ తొక్కుతున్నారు. మానవత్వం అన్నది మచ్చుకైనా కనిపించని వికృత చేష్టలు సమాజంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

పరిసరాలు పరిశీలిస్తూ... రోగుల సేవలు తెలుసుకుంటూ...

పాలేరు ఏప్రిల్ 18(నినాదం):
స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను శనివారం కాయకల్ప బృందం పరిశీలించింది. వైద్య విధాన పరిషత్ అధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్. ప్రియదర్శిని ల బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యత ను పరిశీలించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ.ఎన్ని రకాల మందులు ఉన్నాయి.ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతంటుంది. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుద్ధ్యం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించి చర్చించారు. వైద్య సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంగళ,డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ స్వాప్నికుడు కార్యశూరుడు కామ్రేడ్ రాకేష్ అమర్ రహే

(చరియా)

చేగుంట, ఏప్రిల్ 18 (నినాదం): ఆయన పేరు రాకేష్ అనీ ఆయన శ్రామిక దళిత జన ముద్దు బిడ్డ అనీ ఆయన మరణం తరువాతే తెలిసింది. నారాయణ్ పుర్ లో వాళ్ల తండ్రి తనెత్తు తన కొడుకును పోలీసులు చంపి శవాన్నైనా ఇవ్వడం లేదనీ, చనిపోయిన వివేక్ నా కొడుకే అని పర భాష రాని ఆ అమాయక తండ్రి, చేతిలో తన కన్న కొడుకు ఫోటోతో మౌనంగా దిక్కులు చూస్తూ నిలబడడం చూస్తే హృదయమున్న ప్రతివారికి గుండెలవిసిపోతాయి. మార్చురీలో దిక్కులేకుండా పడి వున్న తన కొడుకు, విప్లవోద్యమంలో సైతం మా 'డాడీ' అంటూ, తన తండ్రి గురించి, ఆయన అలవాట్ల గురించి, ఇంట్లో ఆయన పిల్లలతో ఉండే తీరు గురించి, డ్రైవర్ గా కొలువు చేసి అర్ధరాత్రి, అపరాత్రి ఆయన అలసిపోయి ఇంటికి వస్తే, తను తన డాడీ కోసం చేసే సేవల గురించి ఎంత జ్ఞాపకం చేసుకొని పరితపించేవాడో! ఆ తండ్రికి తెలియదు. కానీ, ఆ తండ్రే బిడ్డను చూడడానికి, బిడ్డ శవాన్ని తన వెంట తీసుకెళ్లడానికి వచ్చి నారాయణ్ పుర్ పోలీసు హెడ్ క్వార్టర్ ముందు పడిగాపులు కాస్తుండడం, ఎన్నడెరుగని విధంగా పోలీసు అధికారులను తన కొడుకు మృతదేహం కోసం ప్రాధేయ పడడం, ఎంతో హృదయవిదారకంగా వుంది. ఒక రాకేష్, ఒక నాగేశ్వర్ రావు, ఒక భూమిక, ఒక విజయ వాళ్లంతా వారి ప్రియమైన నాయకుడు, కామ్రేడ్ నంబళ్ల కేశవరావుకు 24 గంటలు వెంట ఉండే వాళ్లు. మృత్యువులోనూ వాళ్లు ఆయనను వదలి వెళ్లలేదు. అంతేకాదు, శవాలు సైతం ఎవరిళ్లకు అవి వేరు వేరుగా వెళ్లకుండా, విడిపోకుండా, సామూహికంగానే నారాయణపుర్ స్మాశానవాటికలో దహనం కావడం, దేశ చరిత్ర గురించి తెలియదు కానీ, దండకారణ్య విప్లవోద్యమ చరిత్రలోనే అపూర్వమేమో!

ఆ గొప్ప విప్లవ నాయకుడి వద్దకు నవ యువ్వన ప్రాయంలో చేరి కన్న కొడుకును మించిన ప్రేమను ఆయన నుండి పొంది, 'వివేకూ, వివేకూ' అంటూ రోజు ఎన్నిసార్లు ఆ యువకున్ని పిలిచేవాడో కామ్రేడ్ బసవరాజు. ఆయన ప్రతి అవసరం వివేక్ తీర్చాల్సిందే. తీర్చేవాడు కూడా. అలా వినిపించే ఆ పిలుపుల్లో వారి మధ్య పెనవేసుకున్న కమ్యూనిస్టు ఆప్యాయత, వారి కామ్రేడ్లీ అనుబంధాన్ని అక్షరాల్లో బంధించే శక్తి నాకు లేదు కానీ, నాకు తెలిసిన మేరకు వారి సాన్నిహిత్యం మీ ముందుంచుతాను. తమ బిడ్డ విప్లవోద్యమానికి అంకితమై ప్రజా సేవలో ఎలా కొనసాగాడో, పార్టీలో ఎలా వుండేవాడో తెలుసుకోవాలని సహజంగానే ఆరాటపడే రాకేష్ కుటుంబీకులకు, బంధు మిత్రులకు వివరాలు అందించడం బాధ్యత కూడా. వారి అందరికీ సాంత్వన చేకూరాలని కోరుకుంటూ..........

నాకు కామ్రేడ్ వివేక్ తో 2017 ప్రారంభంలో పరిచయం. అప్పుడు ఆయన కామ్రేడ్ దూలదా (కటకం సుదర్శన్) తో వున్నాడు. అప్పటికి ఆయనను యుగంధర్ గా పిలిచేవారు. ఆయనతో దండకారణ్యానికి చేరుకున్న మిగితా తెలంగాణ వాళ్లు కూడా తమ పేర్లు మార్చుకున్నారు. కామ్రేడ్ వివేక్ ప్రారంభంలో నాతో కొద్ది రోజులున్నాడు. అప్పటికి, వివేక్ తో పాటు దండకారణ్యానికి చేరిన ఆ తెలంగాణ బిడ్డలకు ఇంకా పార్టీ పని బాధ్యతలు కేటాయించలేదు. వాళ్లను విప్లవోద్యమంలో భాగం చేసిన అప్పటి తెలంగాణ పార్టీ కార్యదర్శి కామ్రేడ్ లక్మా (హరిభూషన్) అడవికి వచ్చిన ఆ పిల్లలంతా చదువుకున్నవాళ్లంటూ, ముఖ్యంగా విప్లవ సానుభూతిపరుల కుటుంబాలకు చెందిన నమ్మకమైన వారంటూ, వారి అవసరం సీసీకి ఎక్కువగా వుంటుందనీ ఆలోచించి, తన బాధ్యుడైన కామ్రేడ్ దూలాదా కు వారిని అప్పగించాడు.

కామ్రేడ్ దూలాదా ముందు ఎప్పుడూ ఓ పెద్ద జాబితా వుండేది. చదువుకున్నవాళ్లు కావాలంటూ తన ముందున్న సీసీ ప్రతిపాదనల లిస్ట్ ఆయన ఓసారి చూసి కామ్రేడ్ యుగంధర్ ను ప్రధాన కార్యదర్శికి అలాట్ చేశాడు. దానితో వివేక్ నా నుండి విడిపోయాడు. ఆ కొద్ది రోజుల్లోనే ఆయన నాకూ ప్రియమైన వాడయ్యాడు. మనసు విప్పి నాతో అన్నీ పంచుకునేవాడు. అందుకు పని చేసిన ఓ కారణం ఏమంటే, ఆయనతో పాటే అడవికి వచ్చిన 'సుహాసిని' ఆ సమయంలో నాతోనే వుండడంతో, వాళ్ల మధ్య ముందు నుండే ఉన్న కుటుంబ పరిచయాలు, అన్యోన్యత, అనేక విషయాలపై వారి మధ్య జరిగే చర్చలలో నేనూ మధ్య మధ్య భాగమవుతూ, ఈతరం అలవాట్లను, మారుతున్న సామాజిక పరిస్థితులను, యువత అభిరుచులను, వారి నడవడికను అర్థం చేసుకునేవాడిని. నాతో విడిపోతున్నపుడు 'నాకు ఇక్కడే పని కల్పిస్తే బాగుండు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి వివేక్ మరీ వెళ్లాడు.

కామ్రేడ్ వివేక్, నా నుండి విడిపోయి 7వ కంపెనీలో సభ్యుడయ్యాడు. ఆయన అడవికి వచ్చిన మొదట్లో నాతో వున్నపుడు ఆయన నిజంగా చక, చకా నడవలేక తడబడేవాడు. ఏంటి? ఒక యువకుడు తడబడుతూ నడుస్తున్నాడేంటి? అనే సందేహంతో, ఆయన్నే అడిగితే, 'బయట ఏ చిన్న



పనైనా బైక్ తీసుకొని వెళ్లే అలవాటే దాదా. ఈ నడక అక్కడ ఎందుకుంటుంది?' అని మారిన పరిస్థితిని ఒక్క మాటలో చెప్పాడు. అప్పుడు నాకు మా రఫీక్ భాయి గుర్తొచ్చాడు. ఆయన పంజాబీ. మెడిసిన్ చదువుకున్న విద్యార్థి. దాదాపు వివేక్ వయసు వాడే, ఆయన కూడ మొదట్లో అడవిలో నడవలేకపోయేవాడు. సరిగా కింద కూచోలేకపోయేవాడు. నడుస్తుంటే, లావైన ఆయన తొడలు రాసుకుపోయి చర్మం ఎర్రబడి మరీ ఇబ్బంది పడేవాడు. ఆయన బరువు అడిగితే, నవ్వుతూ క్వింటాల్ అన్నాడు. అందరం నవ్వుకున్నాం. ఈ మధ్య ఆయన ఫోటో, ఇతర వివరాలు ఝూర్ఖండ్ లో ఆప్కా న్యూస్ యూ-ట్యూబర్ 'ఇంతకాలం తనకు డాక్టర్ వివరాలు తెలియవంటూ', పొల్లు పోకుండా బయటపెట్టాడు. వివేక్ అడవికి చేరేనాటికి, రఫీక్ భాయి కామ్రేడ్ బసవరాజు తో కలిసి ఝూర్ఖండ్ వెళ్లిపోయాడు. ఇక అదే ఇప్పటికీ ఆయన కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది. కామ్రేడ్ వివేక్, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉద్భవించిన విద్యార్థి సంఘంలో పని చేశాడు. తెలంగాణ సాధన కోసం జరిపిన బస్సు యాత్రలలో, పాదయాత్రలలో పాల్గొన్నాడు. అనేక ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. ఆయనకు అనేక మందితో పరిచయాలున్నాయి. మనిషి చాలా చలాకీగా వుండేవాడేమీ కాదు, అలా అని చెప్పి కామ్రేడ్ వివేక్ అంతర్ముఖీ కాదు. అప్పటికి ఆయన వయసు మూడు పదులు నిండి వుంటాయి. 5.10 అడుగుల ఎత్తుండేవాడేమో! సరిగ్గా కామ్రేడ్ బీ.ఆర్ ఎత్తు అనుకోవచ్చు. వాళ్లకు ఒకరి చెప్పులు మరొకరికి సరిపోయేవి. వివేక్ వాళ్ల మామయ్య, వివేక్ శవం కోసం నారాయణ్ పుర్ వచ్చినపుడు ఓ హిందీ విలేకరి అడిగిన ప్రశ్నలకు చెప్పిన జవాబుల ప్రకారం, 10వ తరగతి వరకు వివేక్ ఊళ్లోనే చదివాడు. ఆ తరువాత ఇంటర్, డిగ్రీ వరంగల్ లో పూర్తి చేసి పోస్ట్ గ్రాడ్యువేషన్ కోసం రాజధాని హైదరాబాద్ నగరానికి వెళ్లాడు. పీ.జీఏ., పూర్తి కాలేదు.

ఈలోపు, ఊళ్లో దొర బిడ్డలతో ఏదో గొడవ రావడంతో, వాళ్లను ప్రతిఘటించాడు. 'దొరలన్నా, వాళ్లతో దెబ్బలాట అన్నా అన్నకు చాలా భయం. నేను వాళ్లతో దెబ్బలాడాను. తరువాత మళ్లీ వాళ్లు ప్రతీకారం తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. అప్పుడు మావోయిస్టు పార్టీతో సంబంధాలున్న ఓ వ్యక్తి ఆయనకు తెలుసు. ఆయన దగ్గరికెళ్లి రాకేశ్ పరిస్థితి అంతా వివరిస్తే, ఆయనే రాకేశ్ ను హరిభూషన్ అన్న దగ్గరికి తెచ్చి వదిలిపెట్టిండు' అని అతను అడవికి రావడం వెనుక గల వృత్తాంతాన్ని ఆ మామయ్య చెప్పాడు. నాకు వివేక్ చెప్పిందదే.

ఆ నేపథ్యంలో పెరిగిన రాకేష్, వివేక్ గా మారి కంపెనీ 7కు వెళ్లాక, అక్కడ గెరిల్లా దిన చర్యలకు అలవాటుపడడం చాలా కష్టమైంది. యూనిట్లో గెరిల్లాగా ఏ డ్యూటీ చేయకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒక తోటి గెరిల్లా నుండి ఏదో మాట రాకతప్పేది కాదు. పొద్దంతా రెండు గంటలు, రాత్రి గంటన్నర నిలబడి సెంట్రీ చేయడం అంటే, నడవడమే అలవాటు లేని రాకేష్ కు వివేక్ గా ఈ పనులన్నీ చేయడం మొదట పెద్ద పరీక్షలాగే అయింది. కిచన్ డ్యూటీ చేయడం మరో 'శిక్ష'. ఇంట్లో అమ్మ లేనపుడు గ్యాస్ స్టౌపై డాడీకోసం, చారెడు బియ్యం వండి, కూర వండిపెట్టిన రాకేష్, వివేక్ గా 100కు పైగా మందికి భట్టీ లాంటి కర్రల పొయ్యి ముందు నిలబడి పొగకు సతమతమవుతూ, మరీ వర్షాకాలం, కుండపోత వర్షం మధ్య పాలిథిన్ టెంట్ కింద వండి పెట్టే టీంలో డ్యూటీ చేయడం యమ పరీక్షగా వుండేది. పొగతో కళ్లు ఎర్రబడి మండేవి, కళ్లెంట నీళ్లు కారేవి. కానీ, ఆ కన్నీళ్లకు ఎన్ని అర్థాలో......!

ఔను. ఆయనకు అలాంటి పరిస్థితులలో తన గత జీవితం గుర్తొచ్చేది. ఇల్లు, కాలేజీ, సిటీ, స్కూటర్ అన్నీ గుర్తొచ్చేవి. అవి నేను కలిసినపుడు నాతో పంచుకునేవాడు. తోటి వాళ్లు కన్సర్న్ గా వుండడం లేదనీ ఫిర్యాదూ చేసేవాడు. నేను నవ్వేవాడిని. కొత్త జీవితానికి అలవాటు పడుతున్నావు. నేర్చుకుంటున్నావు. ప్రతి ప్రారంభం కష్టమే అంటారు అని చెపుతుంటే, నాకూ నా తొలి గెరిల్లా రోజులు గుర్తొచ్చేవి. నేను అడవికి చేరిన రెండో రోజే నా కొత్త చెప్పులే తెగిపోయి, దానికి కొట్టిన మొల గుచ్చుకుంటుంటే, ఆ నొప్పితో నడవలేకపోతూ, నా కళ్ల వెంట నీళ్లు కారుతుంటే, వెళ్తున్న ముందరి వాళ్లతో కలువలేకపోతూ, నన్ను నేనే తిట్టుకున్న ఆ 40 ఏళ్ల నాటి అనుభవం గుర్తొచ్చేది. అవన్నీ వివేక్ తో పంచుకునేవాడిని. ఇద్దరం హాయిగా నవ్వుకునేవాళ్లం. దానితో ఆయన అన్నీ మరిచిపోయి, కొద్ది రోజుల తరువాత మళ్లీ విడిపోతున్నపుడు నవ్వుతూ, 'కలుద్దాం దాదా' అనేవాడు. 'జాగ్రత్త దాదా' అని జోడించడం మాత్రం మరిచిపోయేవాడు కాదు.

అడవిలో అందరినీ పరీక్షించేది మలేరియా. స్థానికులలో ఎవరో కొందరికి తప్ప, గెరిల్లాలంతా మలేరియా పీడితులే. కాకపోతే, కొందరికి తరచుగా, మరి కొందరికి అరుదుగా వస్తుంటుంది. బయటి నుండి అడవికి వెళ్లిన వారు తరుచుగా మలేరియాను ఎదుర్కొనే వారి లిస్టులోనే వుంటారు. మలేరియా రావడం లేదంటే, వారికి సికిల్ సెల్ వుందేమోనని అనుమానించేది. ఇది మన దేశంలో ఈ మూల నుండి ఆ మూల వరకు ప్రధానంగా ఆదివాసీలు ఎదుర్కొనే మరణాంతక వ్యాధి. దేశ ప్రధాని మోదీ, అధికారానికి వచ్చిన తొలి రోజుల్లో జపాన్ సహాయంతో సికిల్ సెల్ వ్యాధికి శాశ్వత చికిత్స కల్పిస్తానని వాగ్దానం చేశాడు. మూడవసారి ఎన్నికైనపుడు ఆ వాగ్దానాన్ని ఏకంగా, వికసిత్ భారత్ కు లింకు చేశాడు. అప్పటి వరకు దేశంలోని లక్షలాది ఆదివాసీలు సికిల్ సెల్ కు బలవ్వాల్సిందే మరి!

మలేరియాలో అప్పుడప్పుడు వివేక్ కు వాంతులయ్యేవి. ఆ సమయంలో ఆయనకు అన్ని విధాలా ధైర్యం చెపుతూ, చికిత్స విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేది బీ.ఆరే. కామ్రేడ్ బీ.ఆర్. పక్కనే వివేక్ పడక కాబట్టి శ్రద్ధగా చూసుకునేవాడు. కామ్రేడ్ వివేక్ ఒక మంచి క్రమశిక్షణ కలిగిన గెరిల్లాగా మారడానికి కామ్రేడ్ బీ.ఆర్ కృషి ఎంతో వుంది. కామ్రేడ్ వివేక్ ఎదుర్కొనే రోజువారి సమస్యలను తన అనుభవం నుండి వివరిస్తూ, కంపెనీ గెరిల్లాలకు, బాధ్యులకు, కొత్తవారిని, బయటివారిని నిలుపుకోవడానికి స్థానికులు, జూనియర్ లను నిలుపుకోవడానికి సీనియర్లు ఎలా పాటుపడాలో, మావో రచనలలో నుండి ఉదాహరణలు తీసి చెప్పేవాడు. ఒక రకంగా చెప్పాలంటే, వివేక్ ను నిలుపుకోవడానికి బీ.ఆర్ చాలా శ్రద్ధపెట్టాడు. అందుకే వారి మధ్య అంతటి కామ్రేడ్లీ అనుబంధం ఏర్పడింది.కామ్రేడ్ వివేక్ కంపెనీ 7కు చేరాక, ఆయనకు ఓ కంప్యూటర్ దొరికింది. దానిపై ఏమేం పని చేయాలో కామ్రేడ్ మధు (28 మంది అమరులలో రాష్ట్ర స్థాయి కామ్రేడ్ నాగేశ్వర రావు) రోజూ చెప్పేవాడు. సరిగ్గా అదే సమయంలో కామ్రేడ్ బీ.ఆర్. సీ.ఎం.సీ బాధ్యతలలో నుండి రిలీవై పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టడంతో, కామ్రేడ్ మధుపై పని భారం పెరిగింది. 'కలిసొచ్చే అదృష్టం వుంటే, నడిచొచ్చే కొడుకు పుడుతాడు' అని తెలంగాణ పల్లెల్లో అన్నట్టు, వివేక్ ఆ యూనిట్ కు పోవడం, మధుకు చాలా తోడ్పడింది. ఆయన పనిని కొంత వివేక్ పంచుకోవడంతో, ఆయన ఇతర పనులు, అధ్యయనం, అనువాదాలపై ఎక్కువ సమయాన్ని వెచ్చించేవాడు. కామ్రేడ్ వివేక్ అంతర్జాలం వద్దకు వెళ్లి మధు చేసే పార్టీ పనులు చేసుకొనీ రావడం కూడ 2023 నుండి ఆయన చేయాల్సిన పనుల జాబితాలో చేరింది.

గెరిల్లా జీవితానికి అలవాటు పడుతున్న కామ్రేడ్ వివేక్ క్రమం తప్పకుండా ఎక్సర్ సైజ్ చేయడం, డ్రిల్ చేయడం మామూలైంది. కామ్రేడ్ బీ.ఆర్ వెంట ఎవరున్నా అడవిలో గెరిల్లాగా, విప్లవకారులుగా వారు తప్పక తమ శరీర ధారుఢ్యాన్ని నిలుపుకోవడానికి అవన్నీ చేయాల్సిందే. చేయనివాళ్లుంటే, వాళ్ల చేయి పట్టి, గ్రౌండ్ వరకు తీసుకెళ్లి, ఇన్ స్ట్రక్టర్ లా ముందు నిలబడి మరీ చేయించేవాడు బీ.ఆర్. వీటి మూలంగా, కామ్రేడ్ వివేక్ శారీరకంగా గట్టిపడి రాత్రనక, పగలనక గంటల తరబడి నడకకు అలవాటుపడ్డాడు. తన తుపాకి, కిట్టు బరువుతో తాను నడవడమే కాకుండా సమష్టి సామానులు పట్టుకొని, మూటలైతే తలపై మోసుకుంటూ నడవడం కూడ అలవడింది. అప్పుడప్పుడూ స్థానికుల్లా కావడి వేసుకొని నడవడం కూడా ప్రాక్టీస్ చేశాడు. ప్రతీది పట్టుదలగా, వినయంగా నేర్చుకోవడం వివేక్ ప్రత్యేకత.

సాధారణంగా యువకులలో ఎవరికన్నా తాను వెనుకబడి పోకూడదని ఉండే పోటీతత్వం, నేర్చుకోవాలనే పట్టుదల వివేక్ లోనూ వుండేది. అదే వికసించే చైతన్యానికి గీటురాయి. వీటితో పాటు కామ్రేడ్ వివేక్, క్రమంగా వంటలు చేయడంలో సీనియర్ల నుండి మంచి అనుభవం సంపాదించాడు. ఈ విషయంలో మాత్రం బీ.ఆర్. బ్యాక్ బెంచ్ వాడే అనుకోవచ్చు. ఇంట్లో అమ్మ చేసిన వంటకాల అనుభవాలను అడవి వంటకాలకు వివేక్ జత చేసేవాడు. క్యాంపులలో పులిహోరా చేయాలన్నా, బిర్యానీ వండాలన్నా, బీ.ఆర్. నోటి వెంట 'వివేకూ, వివేకూ అదేదో ఇవాళ నీ డ్యూటీ అంటున్నారే' అంటూ కాస్తా ఉత్తర కోస్తా యాసలో నవ్వుతూ పిలిస్తే 'సరే, దాదా' అంటూ వివేక్ కిచన్ లోకి దూరేవాడు.

కామ్రేడ్ వివేక్ గోండీ భాష నేర్చుకోవడంలో మాత్రం వెనుకే వున్నాడు. అంటే, భాష రాలేదని మాత్రం కాదు. కానీ, ఫ్లూయెంట్ గా మాట్లాడడంలో వెనుకబడే వుండే. అయితే, తోటి గెరిల్లా కామ్రేడ్స్ తో మాట్లాడడానికి, వారితో చర్చించడానికి కోయలోనే మాట్లాడక తప్పేది కాదు. మిగితా అంతా ఆయన బీ.ఆర్. సహ మధు, వందన, సంగీత ఇతర సీసీ సహ వివిధ స్థాయిల నాయకత్వ కామ్రేడ్స్ ఎవరు కలిసినా వారితో తెలుగు భాషే నడిచేది కాబట్టి కోయపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వివేక్ కు రాలేదు. ప్రజల మధ్య వుంటే మాత్రం తొందరలోనే భాష వచ్చేస్తుంది. వివేక్ చేసే పనులన్నీ మేజర్ గా తెలుగులోనే వుండేవి. అయినప్పటికీ, కంప్యూటర్ పై దేవనాగరి కీ బోర్డుతో పని చేయడం మాత్రం నేర్చుకున్నాడు. స్థానిక భాష, స్థానిక ప్రజల తిండికి అలవాటు పడ్డవాళ్లు, వారి రీతి రివాజులు తెలుసుకొని వారి సంప్రదాయాల పట్ల గౌరవభావంతో వుండే గెరిల్లాలు ప్రజలకు తలలో నాలుకవుతారు. కామ్రేడ్ బీ.ఆర్. తన అపార అనుభవం నుండి ఇలాంటి విషయాలను బోధిస్తూ కామ్రేడ్ వివేక్ ను మడిమ తిప్పని విప్లవకారుడిగా మలిచిన ఒక మంచి శిల్పి, పెద్ద గురువూ అనుకోవచ్చు.

కామ్రేడ్ వివేక్ పెళ్లి గురించి కూడ చెప్పుకోవాలి. ఆయనకు బయట గర్ల్ ఫ్రెండ్ వున్న అనుభవం గురించి మాత్రం నాతో ఎప్పుడూ షేర్ చేసుకోలేదు. అందుకు నా పెద్ద వయసు కూడ ఒక కారణం కావచ్చు. ఆయన సిగ్గూ, ఆయనలోని బిడియం, ఆయన నడత చూస్తే గర్ల్ ఫ్రెండ్ లతో సాన్నిహిత్యం పెంచుకునేంతటి సీన్ వున్నట్టు అగుపడదు. సరే, బయటి విషయాలను వదిలేసి అడవిలో ఆయన అనుభవం చెప్పాలి. ఆయన అమరుడయ్యేనాటికి 37 కు చేరి వుంటాడేమో. గత నాలుగైదేళ్లుగా ఆయనకు పెళ్లి చేయాలనీ బీ.ఆర్. తీవ్రంగానే ప్రయత్నించాడు. వివేక్ కూడ స్వతఃగా కొన్ని ప్రయత్నాలు సహజంగానే చేశాడు. దురదృష్టవశాత్తు ఆయన ఎంచుకున్న గెరిల్లా అమ్మాయిలు నిలకడ కలిగిన, విప్లవ నిబద్ధత కల వారు కాకపోవడంతో అవి విఫలమయ్యాయి. తుదకు, ఆయన పార్టీపైనే భారం వేశాడు. ఈలోపు కామ్రేడ్ బీ.ఆర్. తోటి సీసీఎంలను సంప్రదించి, ఒక కామ్రేడ్ ను వివేక్ ముందు ఆమె ఇష్టపడుతున్న విషయం చెపుతూ ప్రతిపాదించాడు. ఆయనా ఒప్పుకున్నాడు. కానీ, వివిధ కారణాల రీత్యా చివరకు అది కూడ విఫలమైంది. అయినప్పటికీ, ఆయనకు పెళ్లి జరిపించాలనే కామ్రేడ్ బీ.ఆర్ అన్వేషణకు ఫుల్ స్టాప్ పడలేదు. ఆయన ఇక 'విప్లవ బ్రహ్మచారి'గానే ఒకనాటి నక్సల్బరీ తరం నాటి అనేక మందికి వారసుడిగా మిగిలిపోతాడేమోనని నేననుకున్నాను. కానీ, కామ్రేడ్ బీ.ఆర్ అమరత్వానికి కేవలం రెండు మాసాల ముందే కామ్రేడ్ వివేక్-భూమికల వివాహం జరిగింది. ఆ నవయవ్వన జంట కామ్రేడ్ బీ.ఆర్ తోపాటే గుండెకోట్ లో అసువులు బాసారు. కామ్రేడ్ వివేక్ ను పెళ్లి చేసుకోవడం ఇష్టమేనా అనే ప్రపోజల్ భూమిక ముందుకు వెళ్లడంతో, ఏ విషయంలోనైనా ఇద్దరూ పార్టీ నిర్ణయాన్ని అత్యంత సిన్సియర్ గా ఔదలదాల్చే కామ్రేడ్స్ మాత్రమే కాకుండా, ఆ ఇద్దరి మధ్య బయటా-లోపలా చాలా కాలంగా పరిచయాలు వుండడంతో, రాకేష్ అంటే విజయలక్ష్మికి, వివేక్ అంటే భూమికకు ఒకరి పట్ల మరొకరికి సదాభిప్రాయాలు ఏర్పడి వుండడంతో వారి వివాహం మార్చ్ 2025లో జరిగింది. కామ్రేడ్ భూమిక తెలంగాణ లోని రంగారెడ్డి జిల్లా, కేశంపేట మండలం వేముల నర్వా గ్రామంలో కామ్రేడ్స్ వన్నాడ సాయిలు, రాధమ్మలకు పుట్టిన ముగ్గురు బిడ్డలలో చివరి బిడ్డ. కామ్రేడ్ భూమికకు ఒక తమ్ముడున్నాడు. ఆ బిడ్డ కామ్రేడ్ రాకేష్ ను ఇష్టపడి వివాహమాడిన కొద్ది వారాలలోపే ఆశయాల సాధనలో ఆ జంట అసువులు బాయడం.....కళ్లు-కళ్లు కలుసుకొని చేసే బాసలు ఏముంటాయి? మనసు-మనసు విప్పుకొని చెప్పే ఊసులు ఏముంటాయి? ఉంటే ప్రాణం, పోతే ప్రాణం కమ్యూనిస్టులకు ప్రజలే ప్రాణం అన్న నాలుగు దశాబ్దాల ముందరి 'యుగళగీతాన్ని' గుర్తు చేస్తుంది. 1980లలో విప్లవకారుల పెళ్లి వేడుకల సందర్భంగా సాధారణంగా ఈ పాట పాడుకునేది. ఈ పాట నల్లా ఆదిరెడ్డి, సాహూ పాడితే ఎంతో హృద్యంగా వుండేది.కామ్రేడ్ వివేక్ కొరోనా కాలంలో దక్షిణ్ బస్తర్ లో వుండడంతో కామ్రేడ్ లక్మాదా, కత్తి మోహన్ రావ్ (దామాదాదా) ఇతర కామ్రేడ్స్ మరణాలను కళ్లారా చూశాడు.